భూ వివాదాలపై కలెక్టర్ ఆరా

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి గ్రామంలో ఉన్న పెద్దమ్మతల్లి భూములకు సంబంధించిన వివాదంపై జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఆరా తీశారు. మంగళవారం ఎస్పీ అశోక్‌కుమార్, ఆర్డీఓ సాయిశ్రీ, ఎండోమెంట్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్దమ్మ తల్లికి సంబంధించిన భూముల రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పోట్లదుర్తిలోని పెద్దమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామని అవసరమైతే ప్రత్యేక నిధులు కూడా కేటాయించి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే కల్లమల్ల గ్రామంలో పాత కలమల్ల , కొత్త కలమల్ల గ్రామాలకు సంబంధించిన సిద్ధేశ్వర స్వామి ఆలయ భూముల వివాదంపై స్థానిక ప్రజలతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ రెండు గ్రామాల మధ్య ఉన్న భూ వివాదంలో తాము ఎలాంటి జోక్యం చేసుకోమని అధికారులు ఏ నిర్ణయం తీసుకుంటారో దానికి అందరూ కట్టుబడి ఉండాలని సూచించారు.

ఆర్థిక, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్లు నియామకం

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో నూతన ఆర్థిక అధికారిగా ఎంఎంఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జి.రమేష్‌ను ఆర్జీయూకేటీ అధికారులు నియమించారు. ఈయన గతంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, డీన్ అకడమిక్, స్టోరేజ్ అండ్ పర్చేస్ కోఆర్డినేటర్ ఎంఎంఈ విభాగంలో హెచ్‌ఓడీగా పనిచేశారు. అలాగే నూతన కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా డాక్టర్ వై.అరుణ్ కుమార్ రెడ్డిని నియమించారు. ఈయన గతంలో ఎంఎంఈ విభాగం హెచ్‌ఓడీ, అసోసియేట్ గ్రీన్ ఆఫ్ అకాడమిక్‌గా విధులు నిర్వహించారు. వీరు మంగళవారం బాధ్యతలను స్వీకరించారు.



టీడీపీలో భగ్గుమన్న వర్గ విభేదాలు

- భూ వివాదంపై టీడీపీ మండల అధ్యక్షుడిపై దాడి
- పోలీసు స్టేషన పక్కనే పరస్పరం రాళ్లు రువుకున్న టీడీపీ నాయకులు
- ప్రేక్షక పాత్ర వహించిన పోలీసులు


పెండ్లిమర్రిలో పోలీసు స్టేషన్ పక్కనే రాళ్లు రువ్వుకుంటున్న టీడీపీ నాయకులు

పెండ్లిమర్రి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో వాటాల కోసం.. భూ ఆక్రమణల కోసం నిత్యం కుమ్ములాటలు ఎక్కువయ్యాయి. ముఖ్యంగా తెలుగు తమ్ముళ్ల మధ్యే వర్గ విభేదాలు భగ్గుమంటున్నాయి. తాజాగా పెండ్లిమర్రి మండలంలో వాటాల కోసం పోలీసుల ముందే ఇరువర్గాలు గొడవలకు దిగన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పెండ్లిమర్రి మండల టీడీపీలో మంగళవారం వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. భూ వివాదంలో జోక్యం చేసుకున్నాడని టీడీపీ మండల అధ్యక్షుడు గంగిరెడ్డిపై అదే పార్టీకి చెందిన టీడీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, సాంబ శివారెడ్డి, శివారెడ్డి దాడి చేశారు. దాడిలో గంగిరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. పెండ్లిమర్రి గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డికి కోరవాండ్లపల్లె బీసీ కాలనికి చెందిన యాదవులకు గత కొంత కాలం నుంచి భూవివాదం నడుస్తోంది. ఈ వివాదంలో టీడీపీ మండల అధ్యక్షుడు జోక్యం చేసుకుటున్నాడని అతనిపై దాడికి దిగారు. కొద్దిసేపటికి ఇరు వర్గాల వారు అనుచరులను పిలుపించుకొని పోలీసు స్టేషన పక్కనే రాళ్లు, కర్రలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. దాడుల్లో ఇరువర్గాల వారికి గాయాలయ్యాయి. పోలీస్ స్టేషన్ సమీపంలోనే ఇరువర్గాలు దాడులు చేసుకుంటున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తూ మిన్నకుండిపోయారు. గొడవ పూర్తిగా ముగిసిన తర్వాత పోలీసు బలగాలను పిలిపించి మమ అనిపించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం


శివకుమార్ మృతదేహం


మృతి చెందిన రామాంజనేయులు

కొండాపురం : మండల పరిధిలోని లావనూరు సమీపంలో సాయిబాబా గుడి దగ్గర మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రామాంజనేయులు(24), శివకుమార్ (27) దుర్మరణం చెందారు. వీరు బైకుపై వస్తుండగా స్కార్పియో వాహనం ఢీకొన్నట్లు కొండాపురం ఎస్‌ఐ ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా యల్లనూరు మండలంలోని దుగ్గుపల్లె వద్ద పంప్ హౌస్‌లో నాలుగురోజుల నుంచి అక్కడ పని చేసి తిరిగి కొండాపురానికి బైకుపై వస్తుండగా లావనూరు వద్ద స్కార్పియో వాహనం ఢీ కొంది. రామంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. శివకుమార్‌ను 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతులు అనంతపురం జిల్లా పెనుగొండకు చెందిన వారని ఎస్‌ఐ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామన్నారు.

బాల్ బ్యాడ్మింటన్‌కు 'భారతి' విద్యార్థి ఎంపిక


వైశాలిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ కిషోర్ కుమార్

కమలాపురం : రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు డీఏవీ భారతి స్కూల్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థిని పి.వైశాలి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శివ్వం కిషోర్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 24వ తేదీన రాజంపేటలోని ప్రభుత్వ పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న వైశాలి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన వివరించారు. ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు ప్రకాశం జిల్లా చేవూరులో జరిగే రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ సీనియర్ విభాగం పోటీల్లో ఆ విద్యార్థిని పాల్గొంటుందన్నారు. భారతి సిమెంట్స్ సీఎంఓ సాయి రమేష్, హెచ్‌ఆర్ గోపాల్‌రెడ్డి, ఐఆర్ అండ్ పీఆర్ చీఫ్ భార్గవ్ రెడ్డి, డీఏవీ ప్రాంతీయ అధికారి శేషాద్రి తదితరులు వైశాలితో పాటు పీడీ రామచంద్రను అభినందించారు.



యోగాసన పోటీలో భళా


పతకం అందుకుంటున్న సునంద

కమలాపురం : మండలం నల్లలింగాయపల్లెలోని భారతి సిమెంట్స్ కాలనీకి చెందిన చౌడం సునంద రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం అందుకున్నారు. ఈ నెల 21 నుంచి 25 వరకు తాడేపల్లి గూడెం సరస్వతి విద్యాలయం ప్రత్తిపాడులో జరిగిన 6వ రాష్ట్ర స్థాయి యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ 2025 పోటీల్లో పాల్గొన్న సునంద 35–40 ఏజ్ గ్రూప్‌లోని ట్రెడిషనల్ ఆసనాల పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం అందుకున్నారు. అలాగే ట్విస్టింగ్ ఆసనాల పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించారు. జాతీయ స్థాయి యోగాసన పోటీల్లో ఆమె పాల్గొననున్నారు.

బాకీ చెల్లించలేదని దళిత యువకుడి హత్య


సంఘటన స్థలంలో అపస్మారక స్థితిలో పాలగిరి చెన్నయ్య

దువ్వూరు : బాకీ చెల్లించలేదని దళిత యువకుడిని హత్య చేసిన ఘటన దువ్వూరు మండలం మదిరేపల్లె గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు మదిరేపల్లె గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన పాలగిరి చెన్నయ్య (29) అదే గ్రామానికి చెందిన అమ్మిరెడ్డి సంజీవరెడ్డి అనే వ్యక్తి వద్ద పనులకు వెళ్లేవాడు. ఈ క్రమంలో అవసర నిమిత్తమై డబ్బు అప్పుగా తీసుకుని చెల్లించేవాడు. మూడు నెలల క్రితం సంజీవరెడ్డి నుంచి చెన్నయ్య రూ.లక్ష అప్పుగా తీసుకున్నాడు. రెండు నెలల క్రితం తనకు అవసరం ఉందని డబ్బు ఇవ్వాలని సంజీవరెడ్డి అడుగగా తన వద్ద ఇప్పుడు డబ్బు లేదని చెప్పడంతో చెన్నయ్య, సంజీవరెడ్డి గొడవపడ్డారు. ఈ క్రమంలో ఈనెల 24న సాయంత్రం 4 గంటల సమయంలో చెన్నయ్య ఇంటి దగ్గరికి సంజీవరెడ్డి వచ్చి గుడిపాడు గ్రామంలో పని ఉంది పోయి వద్దాం రా అని పిలుచుకుని వెళ్లాడు. అదే రోజు రాత్రి చిన్నసింగన పల్లె – మనేరాంపల్లె మధ్యలో నారు పల్లె మోహన్‌రెడ్డి తోట వద్ద చెన్నయ్యపై సంజీవరెడ్డి విచక్షణా రహితంగా దాడిచేసి మోటార్ బైక్‌తో తొక్కించాడు. రాత్రి 9 గంటల సమయంలో చెన్నయ్య చిన్నాన్న కొడుకు పాలగిరి యోనాకు సంజీవరెడ్డి ఫోన్ చేసి మీ వాన్ని కొట్టిపడేసినా.. ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పాడు. చెన్నయ్య బంధువులు సంఘటన స్థలానికి వెళ్లగా అప్పటికే తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో చెన్నయ్య పడి ఉన్నాడు. వెంటనే వారు ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తీసుకెళ్లాలని సూచించడంతో అక్కడి తీసుకెళ్లారు. రిమ్స్ నుంచి కర్నూలు తీసుకెళ్లగా అక్కడ పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయా ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యంలో చెన్నయ్య పలకకపోవడంతో ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సోమవారం రాత్రి 11 గంటలకు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు పరీక్షించి చెన్నయ్య మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతునికి భార్య శిరీష, ఇద్దరు కుమార్తెలు మహిమ రాణి, మేఘన ఉన్నారు. విషయం తెలుసుకున్న మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చెన్నయ్య మృతదేహాన్ని పరిశీలించి, మండలంలోని మదిరేపల్లె గ్రామానికి వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించి గ్రామస్తులను విచారించారు. ఈ సంఘటనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్య కేసు నమోదు చేశామని, నిందితుడు సంజీవరెడ్డిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు దువ్వూరు ఎస్‌ఐ వినోద్ కుమార్ తెలిపారు. కుటుంబాన్ని పోషించే కొడుకు హత్యకు గురి కావడంతో చెన్నయ్య తల్లిదండ్రులు, భార్యా, పిల్లలు కన్నీరుమున్నీరయ్యారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని వారు కోరారు.

అవార్డుకు ఎంపిక

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ అధ్యాపకుడు డాక్టర్ విరూపాక్షి ప్రభాకర్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపికైనట్లు డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా తెలిపారు. గుంటూరులోని సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ ఆర్గనైజేషన్, కె.వి.ఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి (టీచర్స్ డే) సందర్భంగా జాతీయ ప్రతిభా పురస్కారాలు ప్రకటించనున్నారు. ఈనెల 31వ తేదీన ట్రిపుల్ ఐటీ అధ్యాపకుడు, కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రభాకర్ గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించే కార్యక్రమంలో ఈ అవార్డును అందుకోనున్నారు. జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపిక కావడం పట్ల డైరెక్టర్‌తో పాటు, పరిపాలన అధికారి రవికుమార్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

యోగా పోటీలకు..

వేంపల్లె: రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఎంపికైనట్లు ఆర్కేవ్యాలీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. ఆయన మాట్లాడుతూ వేంపల్లెలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించిన యోగా పోటీల్లో రాణించారన్నారు. మొత్తం తమ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు 6 బంగారు, 5 వెండి, 5 రాగి పతకాలతోపాటు 4 మెరిట్ స్థానాలు సాధించడం విశేషమన్నారు.
















మున్సిపాలిటీపై నిర్లక్ష్యం


మాట్లాడుతున్న చైర్మన్ వరప్రసాద్


కౌన్సిల్ సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులు.

పులివెందుల టౌన్: పులివెందుల మున్సిపాలిటీలో సమస్యలను పరిష్కరించకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సాధారణ కౌన్సిల్ సమావేశం మున్సిపల్ కమిషనర్ రాముడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ వరప్రసాద్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో వీధిలైట్ల సమస్య ఉందన్నారు. ఇంటిపన్ను ప్రభుత్వం అమాంతంగా పెంచడంతో ప్రజలు ఇబ్బందిపడాల్సి వస్తోందన్నారు. నాలుగైదు రోజులకోసారి నీళ్లు వస్తున్నాయని, డ్రైనేజీ సమస్య ఎక్కువగా ఉందని కౌన్సిలర్లు ఈ సందర్భంగా సమావేశం దృష్టికి తెచ్చారు. కౌన్సిలర్లు ఫోన్లు చేస్తే అధికారులు ఎత్తకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. కుక్కల బెడద అధికంగా ఉందని, డాక్టర్లతో మాట్లాడి వాటికి శస్త్ర చికిత్స చేసేందుకు ప్రతిపాదనలు ఇవ్వాలని కోరారు. రూ.12 లక్షల ఎంపీ నిధుల కోసం కలెక్టర్‌కు సిఫార్సు చేయడం జరిగిందని, పండగ సందర్భంగా ఎక్కడా ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. అనంతరం పలు సమస్యల పరిష్కారం కోసం కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ దృష్టికి రోడ్డు సమస్య: వైఎస్సార్ కడప జిల్లా ముద్దనూరు నుంచి సత్యసాయి జిల్లా గోరంట్ల వరకు నిర్మిస్తున్న నేషనల్ హైవే 716జి రోడ్డు నిర్మాణ పనులకు నేషనల్ హైవే అధికారులు ఒకవైపు, రెవెన్యూ అధికారులు సర్వే కొనసాగిస్తున్నారు. సంబంధిత ప్రజలకు గానీ లేదా ఆ మార్గంలోని భూ యజమానులకు ఎలాంటి సూచనలు చేయడంలేదు. వాస్తవానికి నేషనల్ హైవే రోడ్డు నిర్మాణాలు గ్రామాలు లేని ప్రాంతాల్లో 36మీటర్లు, గ్రామాలు, పట్టణాలు ఉన్న ప్రాంతాలలో 26 మీటర్లుగా ఖరారు చేసి సర్వే చేస్తున్నారు. అయితే పులివెందులలో మాత్రం ఇందుకు విరుద్ధంగా పనులు కొనసాగుతున్నాయి. పట్టణంలోని రాయలాపురం నుంచి జేఎన్టీయూ, పులివెందుల పట్టణం రింగ్ రోడ్డు మీదుగా చేపట్టిన సర్వే పనుల్లో అవకతవకలు చోటు చేసుకుంటున్నట్లు భూ యజమానులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్.మనోహర్‌రెడ్డి పులివెందుల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ రాముడు తెలిపారు.

సమస్యలను పరిష్కరించే నాయకుడు

ఘనంగా ఎంపీ వైఎస్.అవినాష్ రెడ్డి ముందస్తు జన్మదిన వేడుక


ు కేక్ తినిపిస్తున్న మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్: పట్టణంలోని ఎరగ్రుడిపల్లెలో కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీసీ ఎస్సీ నాయకులు కోళ్ల భాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కేక్‌ను మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్.మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్పలు కట్ చేసి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, పాఠశాల చిన్నారులకు పంచిపెట్టారు. అనంతరం భోజనం ఏర్పాటు చేశారు. సర్వోత్తమ్‌రెడ్డి, రసూల్, పార్నపల్లె కిశోర్, పురుషోత్తం, కృష్ణమూర్తి, సూరి, హరి, పెద్దవీరయ్య, రాజేష్ నాయుడు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణుడి గ్రామోత్సవం


శ్రీకృష్ణుడి ప్రతిమతో గ్రామోత్సవం

పులివెందుల టౌన్: పులివెందుల త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి గ్రామోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడులలో భాగంగా మంగళవారం స్థానిక అంకాలమ్మ ఆలయం నుంచి పార్నపల్లె రోడ్డు, పూలంగళ్ల సర్కిల్, ముత్యాలవారి వీధి, అమ్మవారిశాల, మెయిన్ బజార్, ఆర్టీసీ సర్కిల్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. శ్రీకృష్ణుడి ప్రతిమను ప్రత్యేక రథంలో కొలువుంచి భక్తి శ్రద్ధలతో రథాన్ని లాగుతూ గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కోలాటం, నృత్యాలు చేస్తూ ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గోపీనాథ్, సునీల్‌కుమార్‌రెడ్డి, గురుమూర్తి, హరిశివ, చంద్రశేఖర్, గౌతమి, అశ్వినిలతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ప్రబోధ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధుల గోల్ మాల్


మాట్లాడుతున్న ఎంపీపీ రమాదేవి

లింగాల: లింగాల మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో 15వ ఆర్థిక సంఘం నిధులపై చర్చ సాగింది. ఎంపీపీ రమాదేవి మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు 2023- 24, 2024-25 ఆర్థిక సంవత్సరాలలో అప్పటి ఇన్‌ఛార్జి ఎంపీడీఓ సురేంద్రనాథ్, ప్రస్తుత ఏఓ లోకేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ స్వాహా చేశారన్నారు. సుమారు రూ.77 లక్షలకు పైగా నిధులను చెక్కుల రూపంలో డ్రా చేసుకుని అక్రమార్జనకు పాల్పడ్డారని ఆరోపించారు. ఎం-బుక్ నెంబర్లు మార్చి నిధులు కాజేశారన్నారు. రెండు నెలల క్రితం జిల్లా పరిషత్ విచారణ సంఘం విచారణ చేపట్టినా, ఇప్పటివరకూ అతీగతీ లేకుండా పోయిందన్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని నిందితుల నుంచి నిధులను రికవరీ చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కారణంగా విచారణ సంఘం చర్యలు తీసుకోవడం ఆలస్య మైందని, రెండు వారాల్లోగా చర్యలు తీసుకుంటారని వివరించారు. అనంతరం మండల అధికారులు సంక్షేమాభివృద్ధి పనులపై వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ యర్రావుల పుష్ప, తహసీల్దారు ఈశ్వరయ్య, ఎంఈఓ రామకృష్ణయ్య, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

డొంకపల్లెను ముంపు గ్రామాల్లోకి చేర్చండి


కలెక్టర్‌కు విన్నవిస్తున్న జనం

కొండాపురం: గండికోట ఎత్తిపోతల పథకం అంతర్భాగమైన ఎస్.తిమ్మాపురం చెరువులో నీళ్లను నిల్వ చేశారు.. బ్యాక్ వాటర్ రావడంతో ఖాళీ చేశామని డొంకపల్లె వాసులు కలెక్టర్ డా.శ్రీదర్ చెరుకూరికి విన్నవించారు. మండలంలోని డొంకపల్లె గ్రామంలో కలెక్టర్ డా.శ్రీధర్, ఎస్పీ ఈజీ.అశోక్‌కుమార్, జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి, భూపేష్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ముంపు గ్రామాల్లోకి డొంకపల్లె చేర్చాలని కలెక్టర్‌కు గ్రామస్థులు విన్నవించుకున్నారు. కలెక్టర్ స్పందించి ఎందుకు తీసుకోలేదని అధికారులను అడిగి తెలుసు కున్నారు.

నిస్వార్థ సేవకురాలు మదర్ థెరిస్సా

పులివెందుల టౌన్: నిస్వార్థ సేవకురాలు, స్ఫూర్తి ప్రదాత మదర్ థెరిస్సా అని జెఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ విష్ణువర్ధన్ అన్నారు. జెఎన్‌టీయూ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జన్మదినాన్ని స్థానిక ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో మంగళవారం నిర్వహించారు. మదర్‌థెరిస్సా చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం విష్ణువర్ధన్ మాట్లాడుతూ నిరుపేదల, అభాగ్యుల జీవితాలలో వెలుగులు నింపిన మహోన్నత అని పేర్కొన్నారు. అనంతరం 30 మంది దివ్యాంగులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాంబయ్య, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

- పట్టణంలోని ఇస్లాంపురం జెడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో మదర్ థెరిస్సా జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. హెడ్మాస్టర్ బండిసుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు మదర్ థెరిస్సా చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దేశానికి మదర్ థెరిస్సా చేసిన సేవలను కొనియాడారు.

ప్రమాణ స్వీకారం

జమ్మలమడుగు: ఎర్రగుంట్ల మండలంలోని రెండు సొసైటీల అధ్యక్షుల ప్రమాణ స్వీకారం పట్టణంలోని మార్కెట్ యార్డులో మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌ఛార్జీ భూపేష్‌రెడ్డి హాజరయ్యారు. తిప్పలూరు సొసైటీ అధ్యక్షుడిగా మోపూరి బంగారెడ్డి, సున్నపురాళ్లపల్లె సొసైటీ అధ్యక్షుడిగా మల్లు గోపాల్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు.